## క్లుప్తంగా

### ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



పట్టాలతో విద్యార్థులు, పాఠశాల సిబ్బంది

కడప ఎడ్యుకేషన్ : కడప ఎన్‌జీవో కాలనీలోని గురుకుల విద్యాపీఠల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో ఎల్‌కేజీ, 5వతరగతి పూర్తిచేసుకున్న విద్యార్థులకు మంగళ వారం పట్టాలను పంపిణీ చేశారు. పాఠశాలలో నిర్వహించిన గ్రాడ్యుయేషన్ కార్యక్రమంలో ఏవీఆర్ విద్యా సంస్థల అధినేత వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గ్రాడ్యుయేషన్ కార్యక్రమంతో విద్యార్థుల్లో నూతనోత్సాహం వస్తుందన్నారు. అనంతరం విద్యార్థుల నృత్య ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ వీరకుమారి, సీఈఓలు వివేకానంద, పల్లవి, ప్రిన్సిపల్ మునిచంద్ర, వైస్ ప్రిన్సిపల్ నరసింహ తదితరులు పాల్గొన్నారు.

### దుస్తుల పంపిణీ



దుస్తులు అందుకుంటున్న నిర్మల ఆస్పత్రి సిబ్బంది

కడప కల్చరల్ : మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక నిర్మల ఆస్పత్రి సిబ్బందికి మంగళవారం దుస్తులు పంపిణీ చేశారు. సంస్థ పట్టణ కోశాధికారి బొమ్మన వీరారెడ్డి తండ్రి దివంగత వీరారెడ్డి వర్ధంతి సందర్భంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. మానవత సంస్థ వ్యవస్థాపకులు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ విలువలు తరిగిపోతున్న నేటి సమాజంలో వీరారెడ్డి అందిస్తున్న సేవలను ప్రశంసించక తప్పదన్నారు. మానవత ఎగ్జిక్యూటివ్ సభ్యులు, విజేత మహిళా మండలి చైర్మన్ అరుణ, సిబ్బంది పాల్గొన్నారు.

### నీటి వసతి ఏర్పాటుచేయాలి



ప్రజలకు త్రాగునీరు అందజేస్తున్న జిల్లా విద్యుత్ శాఖ అధికారి ఎస్.రమణ

కడప కార్పొరేషన్ : ఎండ తీవ్రత పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజల దాహార్తి తీర్చడానికి నీటి వసతి ఏర్పాటుచేయాలని విద్యుత్తు శాఖ జిల్లా అధికారి ఎస్ రమణ కోరారు. కడప విద్యుత్ ఉద్యోగుల సామాజిక సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రంలో మంగళవారం ప్రజలకు తాగునీరు, మజ్జిగ ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండే ఎండల్లో గుక్కెడు నీళ్లు కొండంత ఉపశమనం ఇస్తాయన్నారు. నీళ్లు కొనలేనివారి కోసం అన్ని కార్యాలయాల వద్ద చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు.


### ఓటరుకు భరోసా



కేంద్ర సాయుధ బలగాలతో కవాతు నిర్వహిస్తున్న సీఐ భాస్కర్‌రెడ్డి, ఎస్ఐలు

కడప అర్బన్ : సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నందున ఓటరుకు భరోసా కల్పించేందుకు కేంద్ర సాయుధ బలగాలతో కవాతు నిర్వహించామని సీఐ సి.భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ ఆదేశాల మేరకు కడప వన్‌టౌన్ పరిధిలోని ఎన్టీఆర్ సర్కిల్, కోటిరెడ్డి సర్కిల్, ఆర్టీసీ బస్టాండ్, పూసల వీధి రహదారుల మీదుగా సీపీ బ్రౌన్ ఆర్చ్ వరకు పోలీసులు మంగళవారం కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎలాంటి అల్లర్లు జరుగకుండా, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగే విధంగా అందరూ సహకరించాలని ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు మధుసూదన్‌రెడ్డి, రంగస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

### చెక్కభజన కళాకారుడు మృతి



ఆది పెద్ద వెంకట సుబ్బయ్య

కడప కార్పొరేషన్ : ప్రముఖ చెక్క భజన కళాకారుడు ఆది పెద్ద వెంకట సుబ్బయ్య(72) మంగళవారం కన్నుమూశారు. వల్లూరు మండలం పుల్లారెడ్డిపేట గ్రామంలో మంగళవారంగుండెపోటుతో మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. చెక్క భజన గురువుగా ఆయన కడప ఆకాశవాణిలో ఎన్నో భజన పద్యాలు పాడి ప్రజల మన్ననలు పొందారు. ఎంతో మందికి చెక్కభజన నేర్పించి కళాకారులుగా తయార చేశారు. ఈయనకు ఒక కుమారుడు ఉండగా ఆయన భూగర్భజలశాఖలో అటెండర్‌గా పనిచేస్తూ ఇది వరకే కన్నుమూశారు.

## గ్రహ బాధల నుంచి తప్పించు తల్లీ



విశేష అలంకారంలో విజయదుర్గమ్మ



రాహుకాల పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కడప కల్చరల్ : గ్రహ బాధల నుంచి తమను తప్పించాలని కోరుతూ మహిళా భక్తులు పెద్ద ఎత్తున విజయదుర్గాదేవిని ప్రార్థించారు. కడప నగరంలోని విజయదుర్గాదేవి ఆలయంలో భక్తులు దోష నివారణ కోసం మంగళవారం రాహుకాల పూజలు నిర్వహించారు. తొలుత అమ్మవారి మూలమూర్తిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సామూహికంగా రాహుకాల పూజలు జరిపారు. భక్తులు ఈ సందర్భంగా అమ్మవారికి నిమ్మకాయ దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. నిర్వాహకులు సుధా మల్లికార్జున రావు, దుర్గాప్రసాద్ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. వారు మాట్లాడుతూ ఉగాది నుంచి శ్రీరామనవమి వరకు ఆలయంలో ఉదయం 6 గంటలకు, సాయంత్రం 6 గంటలకు విశేష పూజలు నిర్వహిస్తామని తెలిపారు.

## పేదలపై రాజకీయాలు చేస్తారా?

ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు ఛైర్మెన్ పులి సునీల్



మాట్లాడుతున్న ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు ఛైర్మెన్ పులి సునీల్, గుమ్మా రాజేంద్రప్రసాద్‌రెడ్డి

కడప కార్పొరేషన్ : పేదలపై రాజకీయాలు చేసే నికృష్టమైన ఆలోచన చంద్రబాబుకు రావడం దారుణమని ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు ఛైర్మెన్ పులి సునీల్, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గుమ్మా రాజేంద్రప్రసాద్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి పేర్కొన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ అన్ని రాష్ట్రాల్లో ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు వారికి చేర్చడంలో లోపాలు ఉన్నాయన్నారు. ఇలాంటి లోపాలను సరిదిద్దడానికి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టారన్నారు. 50 ఇళ్లకు ఒక వాలంటీర్‌ను ఏర్పాటు చేసిఅవ్వా, తాతలు, దివ్యాంగులకు ప్రతినెలా ఒకటో తేదీనే ఇంటి తలుపు తట్టి పింఛన్లు అందించేవారన్నారు. ఇది ఓర్వలేకపోయిన చంద్రబాబు ఎన్నోసార్లు వలంటీర్లపై అక్కసు వెళ్లగక్కారని, మాజీ ఎన్నికల అధికారి నిమ్మగడ్డ రమేష్ ద్వారా పిటిషన్ వేయించి వలంటీర్లు పింఛన్లు పంచకుండా ఉత్తర్వులు తెచ్చారన్నారు. పింఛన్లకు తాము అడ్డుపడ్డామని చెప్పుకోలేని టీడీపీ నాయకులు, నిధులు లేకనే ఇవ్వలేదని ప్రభుత్వంపై బురదజల్లడం దారుణమన్నారు. ఇలాంటి నీచ రాజకీయాలు తట్టుకోలేని వలంటీర్లు స్వచ్ఛందంగా రాజీనామా చేస్తున్నారని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో తగిన రీతిలో టీడీపీకి బుద్ధి చెప్పాలని కోరారు.

## నవలా దేశపు మహారాణి సులోచనరాణి

ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి



యుద్ధనపూడి సులోచనరాణి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మూల మల్లికార్జునరెడ్డి

కడప కల్చరల్ : నవలా దేశపు మహారాణిగా యద్దనపూడి సులోచనారాణి గొప్ప పేరు ప్రతిష్ఠలు సాధించారని వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. యద్దనపూడి సులోచనారాణి జయంతి సందర్భంగా కడప రాజీవ్ కల్చరల్ క్లబ్‌లో మంగళవారం ఉదయం సాహిత్య సమావేశాన్ని నిర్వహించారు. తొలుత సులోచనారాణి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ 1964లో సెక్రటరీ నవలతో రచన ప్రారంభించి 80కి పైగా నవలలు రాసి, 1970–80 మధ్యకాలంలో ఎంతోమంది అభిమానుల ప్రశంసలు అందుకున్నారన్నారు. ఆమె రచనల కోసం పాఠకులు అనునిత్యం ఎదురు చూసేవారని, ఆలుమగల మధ్య ప్రేమలు, కుటుంబ కథనాలు రాయడంలో తనకు సాటి లేరని నిరూపించుకున్నారని కొనియాడారు. స్త్రీలు స్వతంత్రంగా ఆలోచించాలని, ఆర్థిక స్వేచ్ఛతోపాటు మానసిక స్వేచ్ఛ ఉండాలని తన నవల్లో ఆమె ఆశించారన్నారు. విశ్రాంత అధ్యాపకులు డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి మాట్లాడుతూ ఆమె రాసిన పలు నవలలు తెలుగులో సినిమాలు వచ్చి విజయవంతమయ్యాయని గుర్తు చేశారు. ఆమె రాసిన ఋతురాగాలు 1996 నుండి 1999 వరకు దూరదర్శన్ సప్తగిరి ఛానల్‌లో 450 భాగాలుగా ప్రసారం కావడం ఆమె విశేష ప్రతిభకు నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో రాజీవ్ కల్చరల్ క్లబ్ సభ్యులు రామనపల్లె శంకర్, ఓబులేసు, బాలఓబయ్య, గురివిరెడ్డి, పుల్లయ్య, గంగయ్య, శేఖర్ పాల్గొన్నారు.

## ఆశాల రికార్డులను తక్షణమే ఇవ్వాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : రాష్ట్ర ప్రభుత్వం ఆశా కార్యకర్తల రికార్డులను తక్షణమే సరఫరా చేయాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు గుంటి వేణుగోపాల్, జిల్లా అధ్యక్షుడు యు.మరియమ్మ డిమాండ్ చేశారు. నగరంలోని డీయంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలో వైద్య ఆరోగ్య శాఖ జిల్లా అధికారి డాక్టర్ నాగరాజుకు మంగళవారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఏప్రిల్ మాసం నుంచి లోని ఆశాల రికార్డులను ప్రభుత్వమే సరఫరా చేయాల్సి వస్తుందన్నారు. ఆశా రికార్డులు కొంటే ఒక్కొక్క ఆశాకు రూ. 3500 ఖర్చు అవుతుందని తెలిపారు. ఆటో ఛార్జీల కింద నెలకు రూ.3 వేల నుంచి రూ.4 వేల రూపాయలు ఖర్చు అవుతుందన్నారు. కొద్దిపాటి వేతనంతో బ్రతుకీడ్చే ఆశాలు ఈ ఖర్చు భరించలేక ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి సి.అమ్ములు పాల్గొన్నారు.

## ఆర్‌పీఎఫ్ మెరుపు దాడులు



నిందితుడి అరెస్టు వివరాలు తెలియజేస్తున్న రైల్వే సీఐ నాగార్జున

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఎర్రగుంట్ల రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాంపై హైదరాబాద్– మంగళూరు ఎక్స్‌ప్రెస్‌లో రైల్వే పోలీసులు తనిఖీలు నిర్వహించారు. కడప రైల్వే ఇన్‌స్పెక్టర్ నాగార్జున, రైల్వే ఎస్ఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ పులివెందులకు చెందిన ప్రసాద్ నుంచి 36 అక్రమ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. స్వాధీనం చేసుకున్న మద్యంతోపాటు వ్యక్తిని అరెస్టు చేసి గుంతకల్లు రైల్వే కోర్టులో హాజరుపరచనున్నామన్నారు. ఈ దాడిలో పాల్గొన్న సిబ్బందిని రైల్వే ఎస్పీ చౌడేశ్వరి అభినందించారు.

## కడప కబడ్డీ జట్టుకు ట్రోఫీ



ట్రోఫీతో అసోసియేషన్ ప్రతినిధులు

కడప స్పోర్ట్స్ : చిత్తూరు జిల్లా పుంగనూరులో మార్చి 29 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించిన రాష్ట్రస్థాయి ఇన్విటేషన్ కబడ్డీ సీనియర్ చాంపియన్‌షిప్ పోటీల్లో కడప జట్టు అగ్రస్థానంలో నిలిచి విజేతగా నిలిచింది. జిల్లా జట్టుకు ప్రాతినిథ్యం వహించిన ప్రోకబడ్డీ ప్లేయర్ ఎం.శివగణేష్‌రెడ్డి తదితర క్రీడాకారులు రాణించడం ద్వారా జిల్లా జట్టు విజేతగా నిలిచిందని కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్.గోవర్ధన్‌రెడ్డి, కార్యదర్శి టి. జనార్ధన్ తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులను వారు అభినందించారు. కార్యక్ర మంలో జాయింట్ సెక్రటరీ ఎం.ప్రసాద్, పి.జయచంద్ర, క్రీడాకారులు పాల్గొన్నారు.

## స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోండి

చెన్నూరు : గ్రామీణ ప్రాంతాలలో తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని సీఐ పార్థసారథి తెలిపారు. చెన్నూరు గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలోని(పార్కు నందు) ప్రజలకు ఆయన ఓటు హక్కుపై అవగాహన కల్పించి మాట్లాడారు. ఏవైనా సమస్యలు ఉంటే గ్రామానికి అతి సమీపంలోని పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. అలాగే వీఆర్వోలు కూడా అందుబాటులో ఉంటారని వారు మీ సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తారన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ ఆంజనేయులు, పోలీసు సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.

### ప్రైవేటు పాఠశాలల శ్రమ దోపిడీ

కడప ఎడ్యుకేషన్ : ప్రైవేటు పాఠశాలల్లో సిబ్బంది శ్రమ దోపిడీని అధికారులు తక్షణమే నిలిపివేయించాలని పీటీఎల్‌యూ రాష్ట్ర కన్వీనర్, జిల్లా అధ్యక్షుడు గడ్డంరాజు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ గత నెల 17వ తేదీ నుంచి ప్రభుత్వం అన్ని యాజమాన్య పాఠశాలలకు ఒంటిపూట బడులను ప్రకటించదన్నారు. అయితే ప్రైవేటు యాజమాన్యాలు మాత్రం ఉపాధ్యాయులతో ఉదయం పాఠశాలలు నిర్వహించడం, మధ్యాహ్నం అడ్మిషన్ల కోసం క్యాంపెయిన్‌ను నిర్వహించేలా చేస్తున్నారని అన్నారు. ఇటీవల క్రిష్ణా జిల్లాలో ఓ ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయురాలికి వడదెబ్బ తగిలి మృతిచెందారన్నారు. ఈ మరణానికి ఎవరు బాధ్యత తీసుకుంటారని ఆయన ప్రశ్నించారు. విద్యాశాఖ అధికారులు స్పందించి మధ్యాహ్నం తర్వాత నిర్వహించే క్యాంపెయిన్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### నేడు అనిమెలలో ఎమ్మెల్యే ప్రచారం

వీరపునాయునిపల్లె : మండలంలోని అనిమెల గ్రామంలో బుధవారం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్ రెడ్డి మధ్యాహ్నం 2 గంటలకు ఇంటింటా ప్రచారం నిర్వహించనున్నట్లు మండల అధ్యక్షుడు రఘునాథ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సర్పంచులు, ఎంపీటీసీలు, గృహ సారధులు, సచివాలయ కన్వీనర్లు, బూత్ కమిటీ సభ్యులు పాల్గొనాలని కోరారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



లక్ష్మీప్రసన్నకు ఆర్థికసాయం అందజేస్తున్న పద్మశాలి సంఘం నాయకులు

కడప కల్చరల్ : బాధిత కుటుంబానికి ప ద్మశాలి కులబంధువులందరూ కలిసి రూ.4,56,000 ఆర్థిక సాయం అందజేశారు. ఒంటిమిట్ట మండలం కొత్త మాధవరంలో చేనేత కార్మికుడిగా జీవిస్తున్న పాల సుబ్బారావు, ఆయన భార్య పద్మావతి, కుమార్తె వినయ ఇటీవల ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. పాల సుబ్బారావు పెద్ద కుమార్తె లక్ష్మీప్రసన్న హైదరాబాద్‌లో చదువుతోంది. ఆ విద్యార్థినికి అండగా నిలిచేందుకు పద్మశాలీయులు శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆ సామాజిక వర్గానికి చెందిన వారు చందాలు వేసుకుని రూ.4,56,000 సేకరించారు. ఈ మొత్తాన్ని మంగళవారం ఒంటిమిట్ట మండలం కొత్త మాధవరంలోని బ్యాంక్‌లో లక్ష్మీప్రసన్న పేరు మీద డిపాజిట్ చేశారు. అందుకు సంబంధించిన డ్రాఫ్ట్‌ను లక్ష్మీప్రసన్నకు అందజేశారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప ద్మశాలి నేతలు ఆమెను పరామర్శించి మేమున్నామని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇలాంటి సంఘటనలు జరగడం బాధాకరమని, జరిగిన నష్టాన్ని పూడ్చలేమన్నారు. తమ వంతు సహకారం అందించామని, భవిష్యత్తులో ఆమెకు ఎప్పుడు ఏ అవసరం వచ్చినా తోడుగా నిలబడతా మని తెలిపారు. అఖిల భారత పద్మశాలి సంఘం నాయకులు గునిశెట్టి సాయికుమార్, జీవీ నాగేశ్వరరావు, గొల్ల రమేష్ సురేంద్ర, కొంకతి లక్ష్మీనారాయణ, అవ్వారు సుబ్బరాయుడు, చెన్న వెంకట సాయికృష్ణ, మూర్తి ఆనంద్ వెంకట చంద్ర, ఈశ్వరయ్య, పిచ్చయ్య, పన్నెల చంద్ర తదితరులు పాల్గొన్నారు.

### ఆయుర్వేద ఆసుపత్రి తనిఖీ



ఆసుపత్రిని తనిఖీ చేస్తున్న ఆర్డీడీ శేఖర్‌రాజు

కడప రూరల్: చెన్నూరులోని ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రిని ఆయుష్ శాఖ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ (ఆర్డీడీ) డాక్టర్ శేఖర్‌రాజు మంగళవారం తనిఖీ చేశారు. రోగులకు అందించే మందులు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయుర్వేద వైద్య విధానంపై ప్రజల్లో అవగాహన కల్పించి, వారికి మెరుగైన వైద్య సేవలందించేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ ఆసుపత్రి డాక్టర్ టీ.రవికుమార్, జీ.రాజశేఖర్, ఫార్మాసిస్ట్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

### 6న మండల సర్వసభ్య సమావేశం

కమలాపురం : స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో ఈనెల 6వ తేదీన ఉదయం 11 గంటలకు ఎంపీపీ గండి భారతి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జ్యోతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఎంపీటీసీ, కోఆప్షన్ సభ్యులు, సర్పంచులు ఈ సమావేశానికి తప్పక హాజరై ప్రజా సమస్యల పట్ల చర్చించాలని ఆమె తెలిపారు.

### అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

పెండ్లిమర్రి : మండలంలోని యాదవాపురం గ్రామానికి చెందిన ఆదిమూలం శ్రీనువాసులు(33) మంగళవారం కొత్తపల్లె గ్రామ సమీపంలోని పొలాల్లో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. శ్రీనువాసులు రోజుమాదిరిగా పొలం వద్దకు వెళ్లాడు. సాయంత్రం అయినా కూడా ఇంటికి రాకపోడవంతో కుటుంబ సభ్యులు పొలం వద్దకు రాగ అప్పటికె అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలాన్ని కడప రూరల్ సీఐ నాగరాజు, ఎస్ఐ సునీల్‌కుమార్‌రెడ్డిలు పరిశీలించారు. మృతదేహానికి గాయాలు ఉండటంతో కుటుంబ సభ్యులు గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేసి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు.

## ఇఫ్తార్ విందులతో మతసామరస్యం

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అంజద్ బాష



ఇఫ్తార్ విందులో ప్రార్థనలు చేస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్ : పవిత్ర రంజాన్ మాసంలో జరిగే ఇఫ్తార్ విందులు మత సామరస్యాన్ని పరిమళింపజేస్తాయని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ.అంజద్‌బాష అన్నారు. స్థానిక మసీదు ఎ అబుబకర్‌లో మంగళవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథి అంజద్‌బాష మాట్లాడుతూ పవిత్ర దైవారాధన, ధార్మిక చింతనకు రంజాన్ మాసం ప్రతీక అన్నారు. మనిషి సత్ప్రవర్తనలో నడవడానికి రంజాన్ ఉపవాసాలు ఉపకరిస్తాయన్నారు. పవిత్రమైన రంజాన్ మాసంలో ఇఫ్తార్ విందు ఎంతో పుణ్య కార్యమన్నారు. అనంతరం అంజద్ భాష సామూహిక నమాజు, పార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో మసీదు కమిటీ సభ్యులు ముబారక్, మస్తాన్, చాన్ బాషా, రహంతుల్లా, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు ఎన్.సుబ్బారెడ్డి, ఎస్‌బీ.అహ్మద్ బాషా, పి.జయచంద్రారెడ్డి, నాగేంద్రప్రసాద్, గంగరాజు, బాలక్రిష్టారెడ్డి, అజ్మతుల్లా, షఫీ, బాలకొండయ్య, మియ్యా పాల్గొన్నారు.

## వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి

రీజనల్ కో ఆర్డినేటర్ కె.సురేష్‌బాబు



సురేష్ బాబును సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం నాయకులు

కడప కార్పొరేషన్: ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి ప్రతి ఒక్కరూ శక్తి వంచన లేకుండా కృషి చేయాలని ఆ పార్టీ రీజనల్ కో ఆర్డినేటర్ కె.సురేష్ బాబు పిలుపునిచ్చారు. స్థానిక అపూర్వ కళ్యాణ మండపంలో నగర వైద్య విభాగం అధ్యక్షుడు డా సతీష్‌కుమారెడ్డి, కమిటీ సభ్యులు సురేష్ బాబును మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ విజయానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డా.పవన్ కుమార్ రెడ్డి, రాజ్ కుమార్, పెంచలయ్య, రామలక్ష్మణ్‌రెడ్డి, ఎల్లారెడ్డి, రామమోహన్ రెడ్డి, రెడ్డిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## అమరవీరుల త్యాగం.. నిత్య స్మరణీయం



ఓటరు చైతన్య కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

వైవీయూ : అమరవీరుల త్యాగాలు నిత్య స్మరణీయం అని యోగివేమన విశ్వవిద్యాలయం ప్రిన్సిపల్ ఆచార్య ఎస్.రఘునాథ రెడ్డి పేర్కొన్నారు. భారత ప్రభుత్వం మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్, వైవీయూ జాతీయ సేవా పథకం సమన్వయకర్త డాక్టర్ ఎస్.వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక విశ్వవిద్యాలయ ప్రాంగణంలోని ఎంసీఏ విభాగంలో 'షహీద్ దివాస్'ను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి మాట్లాడుతూ అమరవీరుల త్యాగాలను నిత్యం స్మరించుకోవాలన్నారు. ఎకనామిక్స్ ప్రొఫెసర్ డాక్టర్ అనిత ఓటరు అవగాహన కార్యక్రమం నిర్వహించి సూచనలిచ్చారు. విద్యార్థుల చేత డాక్టర్ ఎస్.వెంకట్రామిరెడ్డి దేశానికి నా తొలి ఓటు అంటూ యువతతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఎన్ఎస్ఎస్ వలంటీర్లు శ్రమదానం చేసి పిచ్చి మొక్కలు, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. ఓటు హక్కుపై అవగాహనార్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ కే శ్రీనివాసరావు, డాక్టర్ ఎస్. పి.వెంకటరమణ, ప్రొఫెసర్ ఎం.అనిత, డాక్టర్ కే.లలిత, డాక్టర్ సునీత, డాక్టర్ రెడ్డయ్య, డాక్టర్ గంగయ్య, కంప్యూటర్ సైన్స్, జువాలజీ, ఎకనామిక్స్ విభాగాల విద్యార్థులు పాల్గొన్నారు.

## వైఎస్ఆర్‌సీపీలో భారీగా చేరికలు



పార్టీ కండువాలను కప్పి ఆహ్వానిస్తున్న ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి

వల్లూరు : వల్లూరులో మంగళవారం టీడీపీ నుంచి భారీగా వైఎస్ఆర్‌సీపీలోకి చేరికలు జరిగాయి. టీడీపీకి చెందిన మరియు తటస్థంగా వున్న 48 రజకుల కుటుంబాలు తామంతా వైఎస్ఆర్‌సీపీ వెంట వుంటామంటూ వైఎస్ఆర్‌సీపీ తీర్థం పుచ్చుకున్నాయి. ఈ మేరకు వారికి ఏపీఎస్ ఆర్టీసీ రాష్ట్ర చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి, రాష్ట్ర పరిశ్రమల సలహాదారుడు రాజోలు వీరారెడ్డి వైఎస్ఆర్‌సీపీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నేతలు అమర్‌నాథరెడ్డి, సుబ్బారెడ్డి, శివరామిరెడ్డి, బాల వీరారెడ్డి, విశ్వనాథరెడ్డి, బాలిరెడ్డి, నాగసుబ్బారెడ్డి, ఎంపీటీసీలు సుబ్బరాయుడు, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

## సంక్షేమ పాలన కావాలంటే మళ్లీ సీఎం జగనే కావాలి



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న జెడ్పీటీసీ నరేన్ రామాంజులురెడ్డి

చెన్నూరు : రాష్ట్రంలో తిరిగి సంక్షేమ పాలన కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని సీకేదిన్నె జెడ్పీటీసీ నరేన్ రామాంజులు రెడ్డి ప్రజలను కోరారు. మంగళవారం చెన్నూరు టౌన్ రాజుల కాలనీ, సరస్వతి నగర్, యానాదికాలనీ, లక్ష్మీనగర్‌లలో ఆయన కార్యకర్తలతో ఇంటింటి ప్రచారం నిర్వహించి మాట్లాడారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు మేలు చేసిందని, ప్రతి కుటుంబంలో మేలు జరిగివుంటేనే మళ్ళీ వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టాలన్నారు. ఎమ్మెల్యే పోచంరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డిని, ఎంపీ అవినాష్‌రెడ్డిని ఆశీర్వదించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు గుమ్మ రాజేంద్రప్రసాద్‌రెడ్డి, ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్, జీ ఎన్ భాస్కర్‌రెడ్డి, ఆర్వీ ఎస్ఆర్, గణేష్‌రెడ్డి, ముదిరెడ్డి సుబ్బారెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్, టౌన్ కన్వీనర్ నిరంజన్‌రెడ్డి, శ్రీనివాసరాజు, గుమ్మల మధుసూదన్‌రెడ్డి, నిత్యపూజ, సీతారాం, అన్నమయ్య, కృష్ణ, పండు, రామాంజనేయులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు



ఇఫ్తాజుర్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి

పెండ్లిమర్రి : పవిత్ర రంజాన్ మాసంలో జరిగే ఇఫ్తార్ విందు మతసామరస్యానికి ప్రతీక అని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. మంగళవారం నందిమండలం గ్రామంలో వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకులు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై విందులో పాల్గొన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ చంద్రారెడ్డి, ఆగ్రో కార్పొరేషన్ డైరెక్టర్ చావలి శివ, మాజీ ఎంపీపీ అనురాధ, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు రమణారెడ్డి, జెసీఎస్ కన్వీనర్ అమర్‌నాథ్‌రెడ్డి, ఎంపీటీసీ నాగమల్లారెడ్డి, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.